# సీత నేర్పిన విద్య

శ్రీ కాదంబరి వెంకటేశ్వరరావు

"ఏమండీ?......అబ్బ......మిమ్మల్నే.........మాట్లాడరూ?...... "ఊహు హు...హు...చలి...చలి........."ఒక్కసారి నామాట విందురూ...ఆలస్యమౌతోందండి...అంతేమరి...ఊహు...చంటిపిల్లాడిలా యింకా నిద్రే?... వాళ్ళు సత్యవతి, రుక్మిణమ్మగార్లు వెళ్ళిపోతున్నారండి?... మళ్ళీ నే ఒక్కర్తెను వెళ్ళలేను. చిట్టిని చూస్తూ వుండండి. దబ్బున చక్కావస్తాను.........ఇదిగో యిలా చూడండి. యించక్కా గోదావరి స్నానానికి మీరుకూడ రాకూడదూ? ఎంతమంది రావటంలేదు? కార్తీకమాసం పుణ్యం, ఆరోగ్యంకూడాను. మీరెంత యిప్పటికాలపు వారైనా, కార్తీక స్నానంచెస్తే సనాతనుడనుకోరులేండి......ఒకసారి చెపుతే వినాలి మరి...అబ్బ...మిమ్మల్నే......"ఛీ...వెధవగోల అస్తమానూ యీ కార్తీకమాసం నాప్రాణం మీదకు వచ్చినట్టుంది. నీవు మూడువందల అరవైరోజులూ నీటికాకివై వుంటావని నన్నూ రమ్మంటావెందుకు? ఆపుణ్యం కాస్తా నీవే మూటగట్టుకో. నాకక్కర్లేదులే. చిట్టిని నీకూడా తీసుకుపో. అదేడుస్తే దాన్ని నేను వూరుకోబెట్టలేను. అది మళ్ళీ నీ వెనకాలే బయలుదేరి వస్తానంటుంది. నా నిద్రంతా పాడుచేసేవు"......"ఏమి విచిత్రమైన మనుష్యులండీ! కోడికూసినా యింకా నిద్రే? అస్తమానూ నిద్రపోవటం దరిద్రానికి హేతువు. ఇంతకూ నేచెపితే నచ్చుతుందా ఏమిటి? తాపట్టిన కుందేటికి మూడేకాళ్లంటారు. నిర్మలమైన గోదావరి నీటిలో స్నానంచేస్తే, ఎంత హాయి. ఎంత ఆరోగ్యం. మళ్లీఆరోగ్యసూత్రాలు చదివేనంటారే? మీకు ఆ కుళాయినీరు యిష్టంగాని గోదావరి నీరెలా యిష్టమవుతుందిలేండి......పోనీమీ పుణ్యమా అంటూ చిట్టి నిద్రపోతోంది, దాన్నిచూస్తూ యుండండి. అనవసరంగా లేపటమెందుకు?... చిట్టిని చూడండి!...రోజూ నాకూడా వస్తుంది. వచ్చింది వూరికే కూచుంటుందీ? వాళ్ళందరూ చేస్తూవుంటే తానుకూడా చేస్తానని మారాము పెడుతుంది. ఆఖరికి అదికూడా స్నానంచేయక మానదు. చిట్టికంటే చిన్న పిల్లలా ఏమిటి?........."చాలిద్దూ నీసోది. ఆఖరికి వేదాంతంలోకి దిగేవు. చిట్టి ఎవరికి పుట్టిన పిల్ల? తల్లి బుద్ధులే పిల్లకీని. హాయిగా పడుకొన్న నిద్రంతా పాడుచేసేవు. ఏడ్చిందంటే వీధిలోకి దిగబెట్టేస్తాను.........అలాగే బాబూ!...మీయిష్టం. మరి చూస్తూ వుంటారు కదూ?...వెళ్లొస్తా" అంటూ నావైపు తీవ్రంగా చిరునవ్వుతో చూస్తూ చక్కాపోయింది సీత.

◆ ◆ ◆

అనుకున్నట్టే అయింది. వూరుకుంటుందీ? తల్లి అలా వెళ్ళగానే కెవ్వుమని ఏడుస్తూ లేచింది...... "అమ్మా! నేనూ తేత్తానే తానం. మలి నువ్వు తేత్తున్నావుగా?... నేనెందుకు తేయకూడదూ?......" అంటూ నిద్రమంచంమీదనుంచీ పలవరించటం మొదలెట్టింది. అచ్చంగా అన్నివిధాలా అచ్చుతీసినట్లుగా తల్లిరూపే, తల్లిగుణాలే, ఆమెకంటె రెండాకులెక్కువ చదువుకుంది. పెద్దదైతే ఆమెకంటె ప్రబుద్ధురాలవుతుంది. ఏలాగైతే పిల్లా తల్లి కలిసినా నిద్రంతా పాడుచేసేరు. పట్టరానంత కోపం వచ్చింది. రెండులెంపకాల వేద్దామనుకున్నా, మరింత ఏడుస్తుందని వెనక్కు తగ్గేను........."నాన్నగారూ!...అమ్మ గోదావరికి తానానికి ఎల్లింది. నన్ను తీసికెల్లిందికాదు. నేనెలతాను, నన్ను మీరు తీసుకెళ్ళండి. అమ్మ దొంగ నాతో తెప్పకుండా పోయింది." అంటూ మారాము పెట్టింది. చిట్టిని ఏలా వూరడించాలో తెలిసిందికాదు. ఇంక తప్పదురా భగవంతా! ఈ సంసారంతో యిదే గోల" అంటూ విసుక్కుంటూ లేచి బీరువాలోవున్న బొమ్మలన్నీ ముందుపెట్టి, సీసాలోవున్న బిస్కత్తులు, చాక్లెట్లు ముందు పడేసాను. వాట్లన్నింటినీ ఇటూ అటూ జిమ్మిపారేసింది. మొన్న షాపులోకొన్న పెద్దబొమ్మకు కీయిచ్చి ముందుపెట్టేను. యిలాగైనా వూరుకుంటుందేమోని. అబ్బే! ససేమిరా పెంకిముండ?! ఆలా ఊరుకుంటుందీ? తామసంతో నేలకు విసరికొట్టింది. నాల్గు

రూపాయిల బొమ్మా గోతిపాతైంది. పిల్ల బొమ్మలతో తల్లి వ్రతాలతోటీ సరిపోతోంది నా సంపాదనంతాను ......"నా చిట్టితల్లీ అమ్మవస్తుంది ఏడవకు. నీకు మంచి మంచి బొమ్మలూ, తాయిలాలూ తీసుకువస్తాను. అస్తమానూ స్నానంచేస్తే జ్వరం వస్తుంది. గోదావరిలో బూచివుంది. చంటిపిల్లల్ని పట్టుకుంటుంది" అని వోదార్చేను. ఊరుకుంది కాదు. మంచం దిగి ఏడుస్తూ గోదావరి దారిపట్టింది.

ఇదంతా విచిత్రంగావుంది. ఈ పిల్లా తల్లి ఒక ఎత్తు. నేనొక ఎత్తు. తల్లికి తెలిసిన భక్తి, పిల్లకి తెలియని బాలభక్తి. యింత చిన్నతనంలో యింత భక్తి ఎలా కలిగింది?......సీత చెప్పినట్టుగా నేను అధునిక నాకరిక యువకుణ్ణి, నాకు ఈ స్నానాలన్నా, ఆచారాలన్నా కిట్టవు. నేను నవీన సిద్ధాంతాచరుణ్ణయితే, సీత పూర్వ సిద్ధాంతాచరుణురాలు. మాకిద్దరికీ మధ్య ఈపిల్ల సంధి కుదుర్చే సాధనం. ఒక్కొక్కసారినాకు సీతమీద ఎంతో కోపం వచ్చేది. కాని చిట్టివల్ల ఆకోపమంతాపోయి, సీతయందు ఒక విశ్వాసము, ఒక విధమైన పవిత్ర ప్రేమ కలుగుతో వుంటుంది..." అనుకుంటూ మగతనిద్రపోతున్నా......"ఏమోయ్ రామారావు మీ పిల్ల ఏడుస్తూపోతోంది. ఏబండి కిందనైనా పడిపోకలదు" అని కేకవేసేరు. స్నానంచేసి వస్తూన్న పాపయ్యశాస్త్రిగారు కేక విని కంగారుగాలేచి వెనకాల పరుగెత్తాను. అప్పటికప్పుడే సగందూరం పోయింది. స్నానంచేసి ఎదురుగా వస్తోంది సీత. తల్లినిచూసి, తానుకూడా స్నానం చేస్తానని పెంకిపట్టు పట్టింది. మొత్తానికి వెనక్కు తిరిగివెళ్ళి స్నానంచేయిస్తేనేగాని ఊరుకుంది కాదు. పట్టుమని మూడేళ్లు దాటాయో లేదో కాని, ఇంత పట్టుదల, ఇంతభక్తి? మొదటినుంచీ పెంకిపిల్లే లెండి మాచిట్టి.

♦ ♦ ♦

పౌరుషము నశించగా, ఉత్సాహము క్షీణించగా, శక్తి పలుచబడగా, వినేవాళ్లు లేకపోయినా, రెక్కలు రెపరెపకొట్టి, వంగిపోయిన మెడలు నిక్కించి, యింకా పూర్వప్రతాపము నశించలేదు. నామమాత్రా వశిష్టమైవుందని, తెలుపటానికి, కుక్కుటాలు "కొక్కరో...కో" యని కూసినవి. కాస్త పూర్వప్రతాపమంటే సానుభూతి చూపేవాళ్ళు విన్నారు, లేనివాళ్ళు మానేశారు. యింక మీ వైభవము నశించింది. ఎల్లకాలం మీప్రతాపమే నెగ్గుతుందీ? మేమూ మీకంటె ఎంతమాత్రమూ తీసిపోము" అంటూ ప్యాసింజరు "కో" అంటూ పెద్దగా కూసింది. ప్రక్కనున్న యువకుడు నాలుగు గంటలయిందన్నాడు........ "అవునండి. మారిపోయిందంతాను ఇప్పుడు. రైలుబళ్లూ గడియారాలూ, వచ్చేక కోడికూత ఎవరు వింటారు బాబూ. ప్రతిగంటా గడియారాలూ, రైలుషెడ్డూ తెలుపుతోంది కదూ?... ఆ ప్రాచీనాంధ్ర రాజుల ధైర్య, స్థయిర్యాలు కలలోని మాటలయినాయ్. ఆ హోదా అప్పుడే నశించిపోయింది. నాగరికత, విజ్ఞా


## ఉచిత కానుక పొందుడు!

అపూర్వ అవకాశం

పారిస్ బంగారం (రిజిస్టర్డ్) కొనండి. శాస్త్రీయంగా అసలు బంగారంగావుంటుంది. ఔన్సు ($2\frac{1}{2}$ తులాలు) 1 కి రూ 6, 2 ఔన్సులు 10 రూపాయలు ఒక పౌను (16 ఔన్సులు) 72 రూపాయలు చొప్పున అమ్మబడును. ఆభరణాలుకు, గడియారపు కేసస్‌కు, పెన్ నిబ్సుకు వగైరా వాటికి బంగారంతో కలిపిగాని ప్రత్యేకంగాను చేయించుకోవచ్చును.

తృప్తికరంగా లేకపోతే డబ్బు వాపసు చేయబడును. ఇప్పుడే ఒకఔన్సు లేక రెండు ఔన్సులు పారిస్ గోల్డుకు ముందుగా పెద్ద ఆర్డరు యిచ్చేముందు యివ్వండి మీకే తెలుస్తుంది.

తక్షణమే ఆర్డరుయిచ్చి వుచిత కానుక పొందండి. ఇంగ్లీషులోకాని ఫ్రెంచిలోకాని వ్రాయండి.

స్థానిక ఏజంట్లు కావాలి.

*Sole-Distributors :*

**HOUSE OF COMMERCE,**

**4/1, Shilloing Road, GAUHATI.**

నమూ ఎక్కువౌతోన్న కొద్దీ, ఆడంబరం, దాసత్వము, గర్వమూ, ఎక్కువవుతోంది. చూడండి. మనకాలపు వాళ్లకు యిప్పటికాలపు వాళ్లకూ తేడా. యింతకూ ఈ కాఫీహోటేళ్లు వచ్చినాక మరీ ఆయుక్షీణందుర్బలత్వం ఎక్కువైపోయింది. ఇది ఎవరికి పట్టిన బాధ్యత బాబూ" అన్నాడు ప్రక్కను స్నానంచేస్తూన్న తాతగారు.

ఆకాశమంతా అతి నిశ్శబ్దంగావుంది. నక్షత్రాలు మిలమిలమంటూ అల్ప ప్రకాశాన్నిస్తున్నాయ్. ఆ నక్షత్రాల కాంతీ, ఒడ్డునవున్న విద్యుద్దీపాల కాంతీ, నిర్మలము, పవిత్రమైన గోదావరినీటిలో పడి, తళతళ మెరుస్తూ, నీరు కదలినప్పుడల్లా వెండిత్రాచులు బుసలు కొడుతూ పరువెత్తుతున్నట్లుగా వున్నాయ్. నీటిమీద నుంచి వచ్చే శీతలసమీరం ప్రాణానికి హాయినిస్తూంది. కొంతమంది గజగజ వణకుతున్నారుకూడాను. దూర దూరాన్నుంచి, హరికేను లాంతర్లు బారులుదీర్చి ప్రయాణం చేస్తూవుంటే, ఆకసంమీదనుంచి దేవతలు, యీ పుణ్యభూమి మీదకు పవిత్ర గోదావరిస్నానానికి వస్తున్నారా, అన్నట్టు స్త్రీలు, బాలురు, వృద్ధులు, పులకిత గాత్రులై, మందహాసము తాండవిస్తోంటే, భక్తిపరవశులై హరే రామ హరే రామ, రామ రామ, హరే హరే, అంటూ వస్తున్నారు.

కొంతమంది పడుచులు, తమభర్తలు విసుక్కుంటున్నా, బిడ్డలకు కడుపారపాలిచ్చి నిద్రపుచ్చి, ముఖమున దరహాసచంద్రికలు తాండవించుచుండగా, కాళ్ల గజ్జెలు "ఘుల్లు ఘుల్లు" మన పూజాద్రవ్యాలు చంకబెట్టి, చీకట్లో యిటునటు బెదురుమాపులు చూస్తూ వడివడి ప్రయాణం సాగిస్తున్నారు.

అప్పటికప్పుడే తూర్పురేఖ లారుతున్నాయ్. శుక్రాచార్యుని కాంతి, నక్షత్రాల కాంతీ, చంద్రుని కాంతీ క్షీణిస్తోంది. నీలాకాశంమీద కుంకుమచారలు బాటలేసినట్టుగా ఏర్పడ్డాయి. ఈరోజు కార్తీక సోమవారము. మహా పవిత్రమైన రోజు, శ్రీస్వామి సూర్యభగవానుడుకూడా, పూత భారతావనిమీదకు యీ ఆనందాన్ని చూరకొనటానికి ఉత్సాహపడుతూ ప్రయాణం సాగిస్తున్నాడు. స్వామివారి సారధి అరుణుడు గుర్రాలకు, దాణానీరుపెట్టి, రథము కట్టిపోతున్నాడు. స్వామి రథము స్వర్ణమయమైన ఆ ఎర్రని బాటలగుండా వస్తుంది గాబోలు!...

ఆనాడు సీత పట్టుదలవల్ల నేనూ గోదావరిస్నానానికి వచ్చేను. సీత చెప్పిన మాటలన్నీ అక్షరాలా ప్రత్యక్ష ప్రమాణాలయినవి. ఎంతహాయి...ఎంత ఆనందంగావుంది. ఎంతసేపు స్నానమాడినా తనివితీరదు. యిందులోవున్న సుఖాన్ని చిన్నపిల్లయినా చిట్టి కనిపెట్టింది. నేను గ్రహించలేకపోయాను. స్త్రీ లందరూ స్నానాలుచేసి కార్తీక దామోదరుని పూజలుచేసి, కొలుస్తున్నారు. ఎంత భక్తి, ఎంత నిశ్చలత్వం!...... దబ్బపండులాంటి శరీరచ్ఛాయ, ఆజానుబాహువులు, సుందరమైన విగ్రహము, శిరస్సుమీద గోష్పాదమంత పిలక, విశాలమైన నుదుటను తెల్లనైన మహిమగల విభూతిరేఖలతో ఒప్పే శాస్త్రిగారు, దర్భాసనంమీద కూర్చొని, ముఖమున బ్రహ్మతేజస్సు, కళ్లలో దివ్యజ్యోతులు ప్రకాశిస్తోంటే, నోటినుండి అమృతధారలు కురియ, కార్తీక దామోదరుని పావనచరిత్రను శ్రోతలు ఆనందపరవశులయ్యేటట్టు వినిపిస్తున్నారు. స్త్రీలంతా ఆయనచుట్టూ కూర్చొని నిశ్చలభావంతో వింటున్నారు. ఆయన్ని చూడగానే, ఎంతో ఆనందమూ, భక్తీ కలిగింది. "ఆయన ఎంత మహిమగలవాడు? ప్రజలు ఆయన్ని ఒక దేవదూతలా చూస్తున్నారు. ఆయన విద్య ఎంత సార్థకమైంది. ఆ సంస్కృతం, దేశీయ భావలు, ఆప్రాచీనార్య సంస్కృతి. అన్నీ నశించిపోయినాయి. యిప్పటి విద్య గర్వము, అహంకారము, విలాసము, పౌరుషహీనానికే హేతువైంది. నేను కూడా ఆసంస్కృతము, దేశీయ భావాలూ చదువుకుంటే ఆ శాస్త్రిగారిలా గౌరవింపబడుదునుగా" అని ఒక క్షణకాలం ఆలోచనలో నిమగ్నుడనయ్యాను. చిట్టి "నాన్నా అమ్మ వెళ్లిపోతోంది మనంకూడా ఎలదాంలా" అంది. అప్పటికి నాకు స్మృతివచ్చి నీటిలోంచి పైకివచ్చి వళ్లుతుడుచుకున్నాను. సీత బిందెతో నీళ్లు పట్టుకొని ముందు నడుస్తోంది. చిట్టి నేనూ వెనకాల వస్తున్నాం. అక్కడ స్త్రీలు శాస్త్రిగారికి ఒక డబ్బుయిచ్చి నమస్కారం పెడుతున్నారు. ఆయన ఆశీర్వదిస్తున్నాడు. చిట్టికూడా వాళ్లమ్మనడిగి డబ్బుపుచ్చుకొని, నాకంటె ముందువెళ్లి ఆయనకు నమస్కారం పెట్టింది. ఆయన ఏమి ఆశీర్వదించేడో, దానికేమి

అర్ధమైందోగాని, లేతగులాబీ రేఖలాంటి బుగ్గలు గుంటలు పడేటట్టుగా పక్కున నవ్వింది...

♦ ♦ ♦

"హర హర శంభో శంకర" ఓమ్...ఓమ్... ఓమ్........ఆపవిత్ర ఘంటానినాదము భూనభోంతరాళాలు ప్రతిధ్వనించింది. పరమశివుని భక్తులు భక్తి పారవశ్యంచే ఒడలు తెలియక చిరుగజ్జెలు ఘల్లు ఘల్లుమంటూంటే తాండవ నృత్యంచేస్తున్నారు.........ఆ నాటి కార్తీక సోమవారము. వందలకొలది స్త్రీ పురుషులు మార్కండేయ స్వామి గుడికి, దర్శనార్థం వస్తున్నారు. శ్రీస్వామి తన భక్తులనుగాంచి సంతోషాన్ని పట్టజాలక, ప్రశాంతమైన చిరునవ్వు వెన్నెలలు కురిపించి భక్తుల హృదయాలకు శాంతి చేకూరుస్తున్నాడు. జాతిమత విచక్షతలేక అందరూ సమతత్త్వకులై, స్వామివారిని భజిస్తున్నారు........అది ఏమి చోద్యమోగాని!......ఆకాశముననున్న నక్షత్రాలు స్వామిని దర్శిద్దామని నిర్నిమేషగతితో నిశ్చలులంగా వేచియున్నట్లుగా కార్తీక దీపములు ప్రకాశిస్తావుంటే ఆ దృశ్యం చూచిన నేను ఆజ్యోతిర్మయ నక్షత్రాపథంలో లీనమైనట్లు కాన్పించింది. అప్పుడు నేను అలౌకిక, స్వర్గీయానందాన్ని పొందేను. దీనికంతకూ మార్గదర్శకురాలు మా సీతేకదూ?......ఏమిచ్చి ఆమె ఋణము తీర్చుకునేది? ఆరోజున నేనుకూడా ఉపవాసముండి, గుడికి వచ్చినాము. సీత దీపాలు పెట్టుకుంది. గుడిచుట్టూ ప్రదక్షిణంచేసి, "ఫలం, పుష్పం, పత్రం, తోయం" అన్నట్టుగా స్వామికి ఫలములు సమర్పించి, స్వామివారి ప్రసాదం స్వీకరించి గృహాభిముఖులయ్యాము. అప్పటికప్పుడే రాత్రి ఏడుగంటలౌతున్నాయ్. సీత వెనుక వెనుక నడస్తూంటే, చిట్టిని తీసుకొని ముందు నడుస్తున్నాను. దారిలో మామిత్రులు కొందరు ఎదురైనారు. నన్నుచూసి నవ్వటం మొదలెట్టారు.........
"ఓరేవ్ రామారావ్ యిదేమి వేషం? నీవుకూడా సనాతనుడవైపోతివే. ఆడవాళ్లతో, గుళ్ళోకి, పురాణాల్లోకి బయలుదేరుతున్నావ్. యింకనే బాగానే వుంది"...అన్నాడు రాఘవరావు నవ్వుతూ.........
"ఏముందిరా ఇది ప్రతి మనుష్యుని జీవిత కర్తవ్యం. యిదంతా మా "సీత నేర్పిన విద్య" రా అన్నాను. నా ప్రక్కనే నడుస్తున్న సీత ఒక్క చిరునవ్వు నవ్వింది......

SALE! SALE! SALE

**Reduced Sale Price Rs. 3-12-0**



జెంట్స్ లివర్ రిస్టువాచ్ నెం. 44

పూర్వపు ధర రు 8. ఇప్పటి ధర రు 3-12-0. స్విజర్‌లాండ్ దేశములో లివర్ సామానులతో చేయబడినది. ఒక్క నిమిషమైనను తేడాలేక కాలం సరిగా చూపును. ఇండియా అంతటను అనేకవేలు యీమాదిరి గడియారములు అమ్మియుంటిమి. కాని యింత తక్కువ ధరలకు అమ్మియుండలేదు. చేతియందు ధరించిన బంగారపు ఆభరణమువలె యుండును. రోల్డుగోల్డు కేస్ నెం. 44, రు 3-12-0. 3 సం॥ గ్యారంటీ!

వెస్టరన్ స్విస్‌వాచ్ కంపెనీ, పోస్టుబాక్సు 68, మద్రాసు.

**WESTERN SWISS WATCH CO.,**
**Direct Importers. Post Box No. 68, Madras.**

స్థాపితము 1920
కుష్ఠు. క్షయ. బొల్లి. మొదలగు
దీర్ఘవ్యాధులకు ప్రధమ
చికిత్సాలయము



హెడ్డాఫీసు
రెడ్డి అండ్ కో
గోపాలపురము. తూర్పు గోదావరిజిల్లా
బ్రాంచీలు.
వాల్తేరుఆర్.యస్.పోస్టు. గాంధీనగరము బెజవాడ
233, గోవిందప్ప నాయక వీధి ......మద్రాసు